

కొడనాడు కేసులోనూ

కఠిన శిక్షలు తప్పవు

ఈపీఎస్ చెప్పేవన్నీ కట్టుకథలే

సీఎం స్టాలిన్

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): దేశమంతా సంచలనం కలిగించిన పొల్లాచ్చి సామూహిక అత్యాచారా కేసులో ముద్దాయిలకు శిక్షపడినట్లే కొడనాడు ఎస్టేట్ వద్ద జరిగిన వాచ్‌మన్ హత్య, మరో వాచ్‌మన్‌పై హత్యాయత్నం, దోపిడీ కేసుల్లోనూ నేరస్థులకు కఠిన శిక్షలు తప్పవని, ఆ దిశగానే తమ ప్రభుత్వం న్యాయపరంగా చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఆయన ఊటీ బొటానికల్ గార్డెన్‌లో వాకింగ్‌కు వెళ్ళారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలోనే పొల్లాచ్చి సామూహిక అత్యాచార కేసు నిందితులకు కఠిన శిక్షపడేలా చర్యలు చేపడతానని ప్రకటించానని, ఆ కేసులో నిందితులు రాజకీయపరంగా ఎంత పలుకుబడి కలిగి ఉన్నా ఖచ్చితంగా దండించబడతారని కూడా చెప్పానని గుర్తు చేశారు. శాసనసభలోనూ తానీ విషయం ప్రస్తావించి అన్నాడీఎంకే దుష్టపాలనకు పొల్లాచ్చి సామూహిక అత్యాచారం కేసు చక్కటి ఉదాహరణ అని కూడా విమర్శించానని తెలిపారు. పొల్లాచ్చి ముద్దాయిలకు పడినట్లే కొడనాడు కేసు ముద్దాయిలకు కూడా కఠిన శిక్షలు పడేలా చేస్తానని స్టాలిన్ శపథం చేశారు. అన్నాడీఎంకే నాయకుడు ఎడప్పాడి పళనిస్వామి పొల్లాచ్చి ముద్దాయిలకు కఠిన శిక్ష పడటానికి తానే కారణమంటూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈపీఎస్ చెబుతున్నవన్నీ అసత్యాలేనని, పొల్లాచ్చి సామూహిక అత్యాచారాల కేసు, కొడనాడు ఎస్టేట్ కేసుపై కట్టుకథలు చెప్పి జనాన్ని తప్పుదోవపట్టిస్తున్నారని తెలిపారు. పొల్లాచ్చి అత్యాచారాల కేసులో అన్నాడీఎంకే స్థానిక నాయకులకు సంబంధాలున్నాయని తెలియటంతో విచారణ నత్తనడక సాగిందని, చివరకు హైకోర్టు ఆదేశం ప్రకారమే సీబీఐ విచారణ జరిగిందని, వాస్తవాలు వక్రీకరించి తానే సీబీఐ విచారణకు ఆదేశాలిచ్చినట్లు చెప్పడం గర్హనీయమన్నారు. అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సెల్లూరు కె.రాజు జోకర్‌లా వ్యవహరిస్తుంటారని, అందుకనే సైనికులను కించపరిచేలా ఆయన చేసిన వ్యాఖ్యలను తాను పెద్దగా పట్టించుకోనని స్టాలిన్ చెప్పారు.


నీలగిరి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో మహిళ ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఆస్పత్రిలో తనిఖీ...

ఊటీలో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.143.69 కోటతో గత ఏప్రిల్‌లో ప్రారంభించిన నీలగిరి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో బుధవారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ ప్రాంతంలో హాజరుపట్టీని తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో సంతకాలు చేసిన వైద్యులంతా విధులకు హాజరయ్యారా అని ఆరా తీశారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య, ఔట్‌పేషంట్లుగా చికిత్సలందుకునేవారి గురించి డీన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆస్పత్రిలోని ఎక్స్‌రే విభాగం, బ్లడ్ బ్యాంక్, ఎంఆర్‌ఐ స్కానింగ్ సెంటర్ తదితర విభాగాలలోకి వెళ్ళి పరిశీలించారు. అదే సమయంలో ఆస్పత్రిలో చికిత్స కోసం కౌంటర్ వద్ద బారులుతీరిన రోగుల దగ్గరకు వెళ్ళి ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు, నర్సులనుద్దేశించి స్టాలిన్ క్లుప్తంగా ప్రసంగిస్తూ ఆసుపత్రికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధచూపి చికిత్స అందించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజలవద్దకే వైద్యం పథకాన్ని మారుమూల కుగ్రామలలోనూ విస్తరింపచేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రైనీ డాక్టర్లను కూడా ఆయన పలకరించి, వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అదే ప్రాంగణంలో ఉన్న నీలగిరి ప్రభుత్వ వైద్య కళాశాలను కూడా స్టాలిన్ తనిఖీ చేశారు. స్టాలిన్‌తోపాటు ఎంపీ ఎ.రాజా, ప్రభుత్వ విప్ కె.రామచంద్రన్, నీలగిరి జిల్లా కలెక్టర్ లక్ష్మీభవ్య తన్నీరు, నీలగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి డీన్ ఎం.గీతాంజలి, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయలలిత పర్యటించారు.


కూత్తాండవర్ ఆలయ పూజారి చేత తాళి కట్టించుకుని నవ వధువుల్లా సందడి చేస్తున్న హిజ్రాలు - తాళి తెంపుడు కార్యక్రమంలో విలపిస్తున్న హిజ్రాలు


కనుల పండువగా

కూత్తాండవర్ రథోత్సవం

టి.నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ కూత్తాండవర్ ఆలయంలో 18 రోజుల చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది.కళ్ళకురిచ్చి జిల్లా కువాగం గ్రామంలోని ఈ ఆలయంలో వేకువజామున అరవాన్ శిరస్సుకు మొదటి మాల సమర్పణ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత రథోత్సవం ప్రారంభమైంది. ఆలయ మాడవీధుల్లో వేలాదిమంది హిజ్రాలు, భక్తుల నడుమ ఆ రథాన్ని ఊరేగించారు. ఆ తర్వాత ఆ రథం ఆలికళం వైపు వెళ్తుండగా హిజ్రాలందరూ బోరున విలపించారు. మధ్యాహ్నం నత్తం గ్రామంలోని పందిరి ప్రాంతానికి రథం చేరగా, అరవాన్ బలి కార్యక్రమం జరిగింది. ఆ సమయంలో మంగళవారం రాత్రి పూజారి చేత తాళికట్టుకున్న హిజ్రాలందరూ వితంతవుల్లాగా తెల్లటి వస్త్రాలు ధరించి బోరున విలపించారు.ఆ తర్వాత హిజ్రాలందరూ కూవాగం నుండి తమ స్వస్థలాలకు బయలుదేరారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాళి కట్టించుకుని నృత్యం చేసిన హిజ్రాలు...

చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం కువాగం ఆలయంలోని అరవాన్ స్వామి కళ్లు తెరిచే కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా దేశవిదేశాల నుంచి ఈ ఉత్సవాల్లో పాల్గొన్న హిజ్రాలు నవవధువుల్లా అలంకరించుకుని కూత్తాండవర్ ఆలయానికి విచ్చేశారు. కొత్త పసుపు తాళ్ళను కొనుక్కుని, ఆలయం లోపలకు వెళ్ళి అరవాన్‌స్వామిని మొక్కుకుని, ఆ స్వామి వారినే తమ భర్తగా భావిస్తూ ఆలయ పూజారి చేత మెడలో పసుపుతాళ్ళను కట్టించుకున్నారు. పసుపుతాళ్ళను కట్టుకున్న హిజ్రాలంతా బయటకు వచ్చి నృత్యం చేశారు. రాత్రంతా వేల సంఖ్యలో హిజ్రాలు నృత్యాలు చేశారు. కూత్తాండవర్ కీర్తి ప్రతిష్ఠతలను తెలిపేలా పాటలు పాడారు.


సొరంగం పనులు పూర్తిచేసిన కల్వరాయన్ యంత్రం

సొరంగం తవ్వకాలు విజయవంతం

● పెరంబూర్ రైల్వే స్టేషన్ చేరుకున్న 'కల్వరాయన్'

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): రెండో విడత మెట్రోరైలు ప్రాజెక్ట్ మూడో మార్గంలో 'కల్వరాయన్' అరు యంత్రం విజయవంతంగా పనులు పూర్తి చేసుకుని పెరంబూర్ (దక్షిణం) రైల్వే స్టేషన్ చేరుకుంది. చెన్నై మెట్రో రైలు రెండో విడత ప్రాజెక్ట్‌లో 118.9 కి.మీ మేర మూడు మార్గాల్లో నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జపాన్ మల్టీ నేషనల్ సంస్థ, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, న్యూ డెవలప్‌ఎమెంట్ బ్యాంక్‌లు ఆర్థిక సాయం అందిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ మూడో మార్గంలో మాధవరం పాల డిపో నుంచి కెల్లీస్ వరకు 9 కి.మీ వరకు సొరంగం తవ్వే పనులను టాటా ప్రాజెక్ట్ చేపడుతోంది. అందుకోసం 7 యంత్రాలను (టన్నెల్ బోరింగ్ మెషీన్) వినియోగిస్తున్నారు. వాటిలో కల్వరాయన్ అనే యంత్రం అయనావరం మెట్రో రైల్వే స్టేషన్ నుంచి 867మీటర్ల సొరంగం తవ్వకాలు పూర్తిచేసి పెరంబూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అయనావరం, పెరంబూర్ మధ్య సొరంగం చాలా సంక్లిష్టమైనది, పెరంబూర్ రైల్వేస్టేషన్, రైలు మార్గాలు, జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాలు తదితరాల ప్రధాన సవాళ్లను అధికమించి, ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా సొరంగం పనులు పూర్తిచేసిందని అధికారులు తెలిపారు.

పోలీసుశాఖలో మహిళలకు అధిక ప్రాధాన్యం

● వారికి అన్ని సదుపాయాలూ కల్పించండి
● కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి రాష్ట్రంలోనూ పోలీసుశాఖలో మహిళలకు అధిక ప్రాధాన్యమివ్వాలని, మహిళా పోలీసుల సంఖ్య పెంచి, పనిచేసే చోట వారికి సకల సదుపాయాలు కల్పించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ పిలుపునిచ్చారు. పోలీసుశాఖలో మహిళా పోలీసులు చేరి ఐదు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా వండలూరు సమీపం ఊమనంజేరిలో ఉన్న రాష్ట్ర పోలీసు అకాడమీ ఆడిటోరియంలో మంగళవారం 'మహిళా పోలీసు శాఖ - అధికారాల కల్పన' అనే అంశంపై రెండు రోజుల జాతీయ మహానాడును ఆయన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 140 మంది మహిళా పోలీసు అధికారులు ఈ మహానాడులో పాల్గొన్నారు. ఆర్థిక నేరాల విభాగం అదనపు పోలీసు డైరెక్టర్ పాల్ నాగదేవి స్వాగతోపన్యాసం చేశారు. బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్ అండ్ డి) డైరెక్టర్ రాజీవ్‌కుమార్ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర పోలీసు శాఖలో అంకిత భావంతో పనిచేస్తున్న మహిళా పోలీసులు కేసుల దర్యాప్తులో చూపుతున్న ప్రతిభాపాటవాలను వివరించారు. మహిళలకు భద్రత కల్పించడంలోనూ మహిళా పోలీసుల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ముఖ్య అతిథి నిత్యానందరాయ్ మాట్లాడుతూ మహిళా పోలీసుల సేవలను జాతీయస్థాయిలో గుర్తించేలా ఈ మహానాడును ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ రెండు రోజుల మహానాడులో చేసే తీర్మానాలను అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేయాల్సి ఉంటుందన్నారు. మహిళా పోలీసులు పనిచేసే ప్రతి పోలీసు స్టేషన్‌లో వారికి సకల సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. డీజీపీ శంకర్ జివాల్ ముఖ్య అతిథి నిత్యానందరాయ్‌కి జ్ఞాపికతో సత్కరించారు. రాష్ట్ర పోలీసు శిక్షణా సంస్థ డైరెక్టర్ సందీప్‌రాయ్ రాథోడ్ మహానాడు ముఖ్యాంశాలను వివరించారు. ఈ మహానాడు సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కూడా కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఎల్అండ్‌టి విద్యా సాంకేతిక మానవవనరుల సంస్థ అధ్యక్షులు అనితా జయపాల్, హెచ్‌సీఎల్ గ్లోబల్ అధ్యక్షురాలు శ్రీమతి శివశంకర్, సినీనటి రోహిణి, డాక్టర్ రామసుబ్రమణియన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ పీఎం నాయర్ తదితరులు పాల్గొన్నారు.


కేంద్రమంత్రితో డీజీపీ, మహిళా పోలీసు అధికారులు

ఉన్నత విద్యలో రాష్ట్రానిదే అగ్రస్థానం

● ఉపముఖ్యమంత్రి ఉదయనిధి

ప్యారీస్, మే 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఉన్నత విద్యలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని ఉపముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. కోట్టూర్‌పురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీ కార్యాలయం ఆడిటోరియంలో పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి 'నాన్ ముదలవన్ కల్లూరి కనవు'-2025 పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థులను అభినందిస్తూ వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు పాఠశాల విద్య పూర్తి చేసి ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారంటూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉన్నత విద్యను అభ్యసించనున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉండాలన్న ఉద్దేశంతోనే "నాన్ ముదలవన్ కళాశాల" పథకాన్ని ప్రభుత్వం తరుపున పరిచయం చేశామని, ఆర్థికంగా ఇబ్బంది పడే విద్యార్థులకు ఈ పథకం లబ్దిచేకూర్చుతుందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రోత్సాహంతో ఉన్నత విద్యాకోర్సుల్లో చేరి చదువుకుంటున్న వారి సంఖ్య 52శాతం పెరిగిందన్నార విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా రాష్ట్రప్రభుత్వం విద్యాసంస్థల్లో కనీస వసతులను మెరుగుపరచడంతో పాటు, కాలానికి అనుగుణంగా కొత్త పాఠ్యాంశాలను కూడా ప్రవేశపెడుతోందని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రదీప్ యాదవ్, చంద్రమోహన్, కాంతకుమార్, శంకరన్, కన్నప్పన్ తదితరులు పాల్గొన్నారు.


బ్యాంకు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న ఉదయనిధి

నెలాఖరులోగా బూత్ కమిటీ

ఇన్‌ఛార్జుల నియామకం

● పార్టీ నేతలకు ఈపీఎస్ దిశానిర్దేశం

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బూత్‌కమిటీ ఇన్‌ఛార్జులను ఈ నెలాఖరులోపున నియమించాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) జిల్లా నేతలకు ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిదిమంది సభ్యులతో కొత్తగా బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని గతంలోనే ఆయన జిల్లా నేతలకు సూచించారు. అయితే జిల్లా శాఖ నాయకులకు, ఆయా ప్రాంతాలకు చెందిన స్థానిక నాయకులకు మధ్య బూత్ కమిటీల ఏర్పాటుపై విబేధాలు ఏర్పడుతున్నాయి. అంతే కాకుండా స్థానిక నేతల ప్రతిపాదనలను పట్టించుకోకుండా పలు చోట్ల జిల్లా నాయకులు తమకు నచ్చినవారిని బూత్‌కమిటీ సభ్యులుగా నియమిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈపీఎస్ తాజాగా జిల్లా నాయకులకు బూత్‌కమిటీల నియామకాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. స్థానిక నేతల ప్రతిపాదన కూడా పరిగణనలోకి తీసుకుని జిల్లా కార్యదర్శులు బూత్‌కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీలు పార్టీ సులువగా గెలిచేలా ఉండాలనే విషయాన్ని ఎవరూ మరిచిపోకూడదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల బూత్‌కమిటీలను ఏర్పాటు చేసి, వచ్చే జూన్ లేదా జూలైలో బూత్‌కమిటీల మహానాడు జరిపేందుకు ఈపీఎస్ సిద్ధమవుతున్నారు.



తిరుచ్చిలో దారుణం


అలెక్స్ నివాసగృహం వద్ద గుమికూడిన స్థానికులు ఇన్‌సెట్‌లో ముగ్గురి మృతదేహాలు

● ఇద్దరు కుమార్తెలను చంపి దంపతుల బలవన్మరణం

ఆత్మహత్యకు దారితీసిన అప్పుల బాధ


అలెక్స్, విక్టోరియా (ఫైల్‌ఫొటో)

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఇద్దరు కుమార్తెలను హతమార్చి, తామూ బలవన్మరణానికి పాల్పడ్డారో దంపతులు. బుధవారం తిరుచ్చిలో జరిగిన ఈ ఘటన వివరాలిలా వున్నాయి... తిరుచ్చి మేల్ కల్‌కండార్‌కోట మూకాంబికై నగర్‌లో అలెక్స్ (42), విక్టోరియా (35) అనే దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఆరాధన (9), ఆలియా (3) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. అలెక్స్ వస్త్ర దుకాణం నడుపుతుండేవాడు. విక్టోరియో రైల్వే ఉద్యోగిణి. అలెక్స్‌కు వస్త్ర వ్యాపారంలో తీవ్ర నష్టలు వచ్చాయి. దీనికి తోడు మీనాక్షినగర్ ప్రాంతంలో అలెక్స్ సొంతంగా ఇంటిని నిర్మించేందుకు కూడా అప్పులు చేశాడు. వ్యాపారం, ఇంటి నిర్మాణానికి అప్పులు పెరిగిపోవడంతో రెండు నెలల క్రితం వస్త్రదుకాణాన్ని మూసివేశాడు. అప్పులిచ్చినవారంతా ఆయనను వేధించసాగారు. దీంతో అలెక్స్ ఆయన భార్య విక్టోరియా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు మంగళవారం రాత్రి ఇద్దరు కుమార్తెలకు విషం కలిపిన ఆహారం పెట్టి, ఆ తర్వాత తమ గదుల్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం ఆ ఇంటి నుండి ఎలాంటి అలికిడి వినిపించకపోవడంతో చుట్టుపక్కల ఉన్నవారు అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.. పొన్‌మలై పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఇంటి తలుపులు బద్దలుగొట్టి లోపలకు వెళ్ళి చూడగా నురగలు కక్కుకుని చిన్నారులు ఆరాధన, ఆలియా నేలపై శవాలుగా పడి ఉండగా, వేర్వేరు గదుల్లో అలెక్స్, విక్టోరియా ఉరివేసుకుని ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెందారు. నలుగురు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

సమాచార దృశ్యని

ఫైన్ ఆర్ట్స్ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): 'బ్యాచిలర్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్' అనే నాలుగేళ్ల కోర్సులకు ఈ నెల 28వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. స్థానిక తరమణిలోని రాష్ట్ర ప్రభుత్వ ఫిల్మ్ అండ్ టెలివిజన్ శిక్షణా సంస్థలో 2025-26 విద్యా సంవత్సరానికి సినిమాటోగ్రఫీ, డిజిటల్ ఇంటర్మీడియట్, ఆడియోగ్రఫీ, డైరెక్షన్ అండ్ స్క్రిప్ట్ రైటింగ్, ఫిల్మ్ ఎడిటింగ్, యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ తదితర కోర్సులకు www.filminstitute.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 28వ తేది సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు పంపించాలని కళాశాల నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి 'పారాచూట్' సాహస క్రీడలు

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లో పర్యాటకులను మరింత పారాచూట్ సాహస క్రీడలు ఈ నెల 16 నుంచి 19వ తేది వరకు జరుగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు జరుగనున్న ఈ సాహస క్రీడల్లో భాగంగా పర్యాటకులు పారాచూట్‌లో గాలిలో ఎరుగుతూ ఆనందించవచ్చు. ఆకాశంలో ఒక రౌండ్‌కు ఒకరికి రూ.200 రుసుముగా నిర్ణయించారు. ఒక్కో పారాచూట్‌లో 15 నుంచి 60 ఏళ్లలోపున్న ఇద్దరు ప్రయాణించవచ్చు. కాగా, పారాచూట్ ఎగిరే ప్రాంతాలు, పర్యాటకుల భద్రత తదితర విషయాలను పర్యాటక శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు.

28 రైల్వేస్టేషన్లలో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ సెంటర్లు

టి.నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం విపరీతంగా పెరగటంతో రైల్వేస్టేషన్లలో వాహనాల కోసం ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. ఆమేరకు 28 రైల్వేస్టేషన్లలో ఈ ఛార్జింగ్ సెంటర్లు నెలకొల్పనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే చింతాద్రిపేట, మూర్‌మార్కెట్ కాంప్లెక్స్, లైట్‌హౌస్, మైలాపూర్, వేళచ్చేరి, కోట్టూరుపురం రైల్వేస్టేషన్లలో ఛార్జింగ్ సెంటర్ల నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయని వివరించారు. ఇదే విధంగా చెంగల్పట్టు, త్రిశూలం, తరమణి, గిండి రైల్వేస్టేషన్లలోను ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

ఓమండూరార్ ఆస్పత్రిలో మరో రెండు మందుల కౌంటర్లు

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓమండూరార్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో అదనంగా రెండు మందుల కౌంటర్లు ఏర్పాటుచేయనున్నారు. ఈ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య అధికమవుతోంది. వైద్య పరీక్షల తరువాత వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తో మందుల కోసం కౌంటర్ల వద్ద ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఇన్‌పేషంట్లు మందులు తీసుకెళ్లాల్సి ఉండడంతో కౌంటర్లు వద్ద భారీ క్యూలైన్ కనిపిస్తోంది. ప్రస్తుతం 5 కౌంటర్ల ద్వారా మందులు అందిస్తున్నారు. రోగులు, వైద్యుల సూచనల మేరకు అదనంగా మరో రెండు మందుల కౌంటర్లు బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు.

రేపు టెన్త్, ప్లస్ వన్ పరీక్షా ఫలితాలు

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): టెన్త్, ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు ఇదివరకే ప్రకటించిన ఈ నెల 19వ తేదీకి బదులు 16వ తేది విడుదల కానున్నాయని ప్రభుత్వ పరీక్షల శాఖ తెలిపింది. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 15వ తేది వరకు జరిగాయి. ఈ పరీక్షలకు 12,480 పాఠశాలలకు చెందిన 4,46,411 మంది విద్యార్థులు, 4,40,465 మంది విద్యార్థినులు, 25,888 మంది ప్రైవేటు అభ్యర్థులు, 272 మంది ఖైదీలు మొత్తం 9,13,036 మంది హాజరయ్యారు. ఈ పరీక్షా ఫలితాలు ఈ నెల 19వ తేది విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల శాఖ ఇదివరకే ప్రకటించింది. ఈ నేపథ్యంలో, టెన్త్ పరీక్షా ఫలితాలు ఈ నెల 19వ తేదీకి ముందుగా 16వ తేది ఉదయం 9 గంటలకు విడుదల కానున్నాయి. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షా ఫలితాలు విడుదల కానున్నాయని అధికారులు తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉచిత శిక్షణ

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 పరీక్ష రాసే దివ్యాంగ విద్యార్థులకు నగరంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-4 పరీక్షకు విద్యార్హత 10వ తరగతి కావడంతో అభ్యర్థులు అధికంగా పోటీపడుతుంటారు. ఈ నేపథ్యంలో, గ్రూప్-4 పరీక్షకు హాజరుకానున్న దివ్యాంగ విద్యార్థులకు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు నకలు, ఫొటోలతో గిండిలోని దివ్యాంగుల ప్రత్యేక ఉపాధి, కెరీర్ మార్గదర్శక కేంద్రాన్ని సంప్రదించాలని, చెన్నై జిల్లాకు చెందిన దివ్యాంగ విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

'ఉత్తమ రచన'లకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే14(ఆంధ్రజ్యోతి):తమిళ భాషాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గత 2024వ సంవత్సరానికి ఉత్తమ రచనల పోటీకి జూన్ 16వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు.ఈమేరకు తమిళ భాషాభివృద్ధి డైరెక్టర్ ఎన్.అరుళ్ విడుదల చేసిన ప్రకటనలో... 2024 జనవరి 1నుంచి డిసెంబరు 12వ తేది వరకు తమిళంలో రచించిన చిన్న కథలు, నాటకం, బాలల సాహిత్యం, తమిళ జీవనశైలి సహా 33 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ప్రతి విభాగంలో ఒక్కో రచన ఎంపిక చేసి,రచయితకు రూ.50 వేలు, ప్రచురణ సంస్థలకు రూ.25 వేలు ఇవ్వనున్నారు. దరఖాస్తులు https://tamilvalarchithurai.org/siranthanool/ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తిచేసిన దరఖాస్తుతో ఐదు పుస్తక ప్రతులు, పోటీ రుసుము రూ.100 (తమిళ అభివృద్ధి డైరెక్టర్, చెన్నై అనే పేరుతో డీడీ) తదితరాలు జతకలిపి 'తమిళ అభివృద్ధి డైరెక్టర్, తమిళ అభివృద్ధి కార్యాలయం మొదటి అంతస్తు, తమిళ్ రోడ్డు, ఎగ్మూర్, చెన్నై-600008' అనే చిరునామాకు జూన్ 16వ తేదిలోపు పంపించాలి. మరిన్ని వివరాలకు 044-28190412, 28190413 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

రాజధాని నగరంలో 1.80 లక్షల వీధి కుక్కలు

● ప్రకటించిన జీసీసీ


నగరంలో పెరిగిపోతున్న వీధి కుక్కలు

ప్యారీస్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో సుమారు 1.80 లక్షల వీధి కుక్కలున్నాయని ప్రకటించిన గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) వీటికి రూ.3 కోట్లతో రాబిస్ ఇంజక్షన్లను జూన్ నుంచి వేయనున్నట్లు తెలిపింది. జీసీసీ నిర్వహణలోని 15 జోన్లలోని 200 వార్డుల్లో పెరుగుతున్న జనాభాతో పాటు వీధికుక్కల సంఖ్య కూడా పెరుగుతోంది.వీటి బెడద నివారించే దిశగా ప్రణాళిక రూపొందించిన కార్పొరేషన్ సంతాన నిరోధక శస్త్రచికిత్స, రాబిస్ ఇంజక్షన్ వేయడంతో పాటు పెంపుడు జంతువులకు లైసెన్స్ విధానాన్ని కూడా అమలుపరుస్తుంది. వీధి కుక్కల బెడద అధికంగా ఉన్న ప్రాంతాల్లో వాటిని వేటాడి వాహనాల ద్వారా సంరక్షణ కేంద్రాలకు తరలిస్తున్నారు. సంతాన నిరోధక శస్త్రచికిత్స చట్టం 2023 ప్రకారం వాటిని మళ్ళీ పట్టుకున్న చోటే వదిలివేస్తున్నారు. మరీముఖ్యంగా పిచ్చికుక్క కాటుకు నగరవాసులు గురికాకుండా, రాబిస్ వ్యాధిని నివారించేందుకు అనుగుణంగా పులియాన్‌తోప్పు, లాయిడ్స్ కాలనీ, కన్నమ్మపేట, షోలింగనల్లూరు, మీనబాక్కం ప్రాంతాల్లో కుక్కల సంతాన ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటితో పాటు 1,2,3,4,5,7,8,11,12,14, జోన్లలో ప్రతిరోజు 30 వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్స, రాబిస్ ఇంజక్షన్ వేసేలా అదనంగా మరో పది కేంద్రాలు నిర్మాణం దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, పశువుల సేవా కేంద్రం (డబ్ల్యూవీఎస్) స్వచ్ఛంద సేవా సంస్థలతో కలిసి జీసీసీ నగరంలోని 200 వార్డుల్లో ఇటీవల నిర్వహించిన సర్వేలో 1,80,157 వీధి కుక్కలున్నట్లు గుర్తించారు. వీధి కుక్కల రహిత నగరంగా రాజధానిని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జూన్‌లో రూ.3 కోట్ల తో రాబిస్ ఇంజక్షన్ వేసే పనులు ప్రారంభమవుతాయని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

● వీసీల నియామకం వ్యవహారం...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసు

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ నియమించే అధికారం ప్రభుత్వానికి ఇవ్వాలంటూ అసెంబ్లీలో నెరవేర్చిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ న్యాయవాది వెంకటాచలపతి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా చట్టసవరణ జరిగిందని పిటిషన్‌లో తెలిపారు. వీసీలను రాష్ట్ర ప్రభుత్వమే ఎంపిక చేసే తీర్మానాన్ని గెజిట్‌లో ప్రచురించారని, ఈ గెజిట్‌కు స్టే విధించాలంటూ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ బుధవారం విచారించిన హైకోర్టు న్యాయమూర్తులు జీఆర్ స్వామినాథన్, వి.లక్ష్మీ నారాయణన్‌లతో కూడిన ధర్మాసనం, ఈ పిటిషన్‌పై బదులు పిటిషన్ దాఖలుచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులిచ్చి, తదుపరి విచారణ వచ్చే వారానికి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

వైభవంగా పార్‌కొడి అమ్మన్ ఆలయ ఉత్సవం


రథంలో ఊరేగుతున్న అమ్మవారు

వేలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): అనైకట్టు సమీపం వేలంగాడు గ్రామ సమీపంలోని చెరువు గట్టుపై వెలసిన పార్‌కొడి అమ్మన్ ఆలయ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు వల్లాండరామ్, అనాసిపాళ్యం, వేలంగాడు, పూనంగాడు సహా 25 గ్రామాల ప్రజలు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై కుటుంబాలతో సహా వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. వ్యవసాయం లాభసాటి ఉండాలి, పశువులు, కోళ్లు, మేకలకు ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండాలని కోరుతూ వాటి బొమ్మలను కానుకలుగా సమర్పించారు. అమ్మవారికి మేకలను బలిచ్చి, అక్కడే ఆహారం తయారు చేసి భక్తులకు అందజేశారు. అనంతరం అలంకరించిన పుష్ప పల్లకీలో అమ్మవారు బయల్దేరారు. ఈ రథం 25 గ్రామాల మీదుగా వెళ్లి మూడవ రోజు మళ్లీ ఆలయానికి చేరుతుందని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులతో రోడ్లమీద పనులు



తిరుత్తణి, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న వాహనాల సర్వేలో పాఠశాల విద్యార్థులతో పనులు చేయిస్తున్నారని అక్కడి ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే తిరుత్తణి-అరక్కోణం హైవేపై జాతీయ రహదారులశాఖ అధికారులు నిర్వహించాల్సిన వాహన సర్వేలో ఎండ వేడికి తట్టుకోలేక వారు వెళ్లడం లేదు. అక్కడి పాఠశాల విద్యార్థులతో రోజంతా ఎండలో పనులను చేయిస్తున్నారు. దీనిని గమనించిన ప్రజలు అధికారులను ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పి తప్పించుకున్నారు. దీనిపై బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేయగా, విషయం తెలుసుకున్న పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని విద్యార్థులు చేస్తున్న పనులను ఆపి వారిని ఇంటికి పంపించారు.

వినతిపత్రాలపై కలెక్టర్ విచారణ


లబ్ధిదారులను విచారిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): నగర ప్రాంతాల ప్రజలకు ఇళ్ల పట్టాలు అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. పట్టాలు కోరుతూ వినతిపత్రాలు సమర్పించిన వారి ఇళ్ల వద్దకే వెళ్లి అధికారులు విచారిస్తున్నారు. ఈ క్రమంలో కార్పొరేషన్ పరిధిలోని 2వ మండలం 1వ వార్డులో పట్టాలు కోరుతూ వినతిపత్రాలు సమర్పించిన వారిళ్ల వద్దకు వెళ్లిన కలెక్టర్ సుబ్బులక్ష్మి, వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో మాలతి, సర్వే డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కుమరన్, వేలూరు సబ్ కలెక్టర్ సెంథిల్‌కుమార్, 3వ మండల అధ్యక్షుడు యూనస్‌ఖాన్, వేలూరు తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

● టాస్మాక్ అవినీతి కేసు ...

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

ప్యారీస్, మే 14 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ అవినీతి కేసుకు సంబంధించి వివరాలు సమర్పించాల్సిందిగా రాష ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని టాస్మాక్ సంస్థ మద్యం చిల్లర దుకాణాలకు పంపిణీ చేసే మద్యం ప్రైవేటు కర్మాగారాల నుంచి కొనుగోలు చేయడంలో భారీగా అవినీతి జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో మార్చిలో ఈడీ అధికారులు ఎగ్మూర్‌లో ఉన్న టాస్మాక్ ప్రధాన కార్యాలయంతో పాటు 20కి పైగా ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో స్వాధీనం చేసుకున్న దస్తావేజుల్లో సారాంశాన్ని ఈడీ నివేదికగా విడుదల చేసింది. అందులో టాస్మాక్ మద్యం చిల్లర విక్రయ దుకాణాల్లో ఎంఆర్‌పీ ధరకంటే ఒక బాటిల్‌కు అదనంగా రూ.10 నుండి రూ.30 వరకు వసూళ్లు చేస్తున్నారని, టాస్మాక్ అధికారులకు డిస్టలరీ కంపెనీలతో ప్రత్యక్ష సంబంధాలున్నాయని, కొనుగోలు తగ్గించి చూపారని, ఉద్యోగుల బదిలీ, బార్ లైసెన్స్ పంపిణీకి పెద్దమొత్తంలో లంచాలు పుచ్చుకున్నారని ఈడీ తన నివేదికలో ఆరోపించింది. టాస్మాక్ ఉన్నతాధికారుల ఒత్తిళ్ల మేరకు డిస్టలరీ కంపెనీలతో ఒప్పందం కుదిరిందని, ఇలాంటి అవినీతి కార్యకలాపాల ద్వారా టాస్మాక్ సంస్థలు రూ.1000 కోట్లకు పైగా అవినీతి జరిగినట్లు ఈడీ ప్రకటించింది. దీని ఆధారంగా ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసులో సీబీఐ విచారణకు ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం టాస్మాక్ అవినీతి కేసుకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం, కేంద్రప్రభుత్వం, ఈడీ, ఏసీబీలు పూర్తి వివరాలతో సమాధానం చెప్పాల్సిందిగా ఆదేశించి, తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఈపీఎస్‌కు ఘన స్వాగతం


ఎడప్పాడికి గజమాల వేస్తున్న అన్నాడీఎంకే శ్రేణులు

తిరుత్తణి, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్ళి బుధవారం ఉదయం రాష్ట్రానికి తిరిగొచ్చిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి తిరుత్తణి మండల పార్టీ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. మాజీ ఎంపీ హరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళల హారతుల నడుమ ఎడప్పాడిని గజమాలతో స్వాగతించారు. అనంతరం ఈపీఎస్ మాట్లాడుతూ, ప్రజలు డీఎంకేను ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా వున్నారన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొనడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ప్రభుత్వ కళాశాలల్లో 25 శాతం అదనపు అడ్మిషన్లు

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ల కోరుతూ వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అదనంగా 5-10 శాతం సీట్లు భర్తీ చేస్తుంటారు. రాష్ట్రంలోని 64 కళాశాలల్లో రెండు షిఫ్ట్‌ల తరగతులు ప్రవేశపెట్టగా, పాలిటెక్నిక్, ఉన్నత విద్యలో 11 కొత్త కోర్సులు పరిచయం చేశారు. ఈ కారణంగా 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరగనుందని ఉన్నత విద్యాశాఖ అంచనా వేస్తోంది. విద్యార్థుల దరఖాస్తుల ఆధారంగా 25 శాతం అదనపు అడ్మిషన్లు చేపట్టే అవకాశముందని అధికారులు తెలిపారు.

శ్రీలంక జైలు నుంచి 9 మంది జాలర్ల విడుదల

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి ఆ దేశ జైలులో ఉన్న 9 మంది జాలర్లు విడుదలయ్యారు. సరిహద్దులు దాటారని ఆరోపిస్తూ రామనాథపురం జిల్లాకు చెందిన 9 మంది జాలర్లను అరెస్ట్ చేసిన లంక నావికాదళం వారిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించింది. ఈ నేపథ్యంలో, చిత్రా పౌర్ణమిని సందర్భంగా రాష్ట్ర జాలర్లను విడుదల చేస్తూ శ్రీలంక ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని, విడుదలైన జాలర్లు ఒకటి, రెండు రోజుల్లో నగరానికి పంపనున్నట్లు శ్రీలంకలోని భారత దౌత్య కార్యాలయం తెలియజేసిందని రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

కలెక్టర్ కార్యాలయంలో వైద్య శిబిరం

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ విడుదల చేసిన ప్రకటనలో... చెంగల్పట్టులోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో ప్రతి గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. ఇకపై ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయం కింది అంతస్తులోని 'బి బ్లాక్'లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్థోపెడిక్, కన్ను, చెవి, ముక్కు, గొంతు, న్యూరాలజీ, మానసిక ఆరోగ్యం, పిల్లల వైద్యులతో కూడిన వైద్య బృందం శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించి సూచనలు ఇవ్వనున్నారని, ఈ అవకాశం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

రైలులో 14 కిలోల గంజాయి స్వాధీనం

వాషర్‌మెన్‌పేట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ సమీపంలో ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా తరలిస్తున్న 14 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివేక్ ఎక్స్‌ప్రెస్ బుధవారం ఉదయం ఈరోడ్ జంక్షన్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. రైల్వే పోలీసులు బోగీల్లో తనిఖీలు చేస్తున్న సమయంలో, అన్‌రిజర్వ్‌డ్ బోగీ టాయిలెట్ సమీపంలో ఓ బ్యాగును గుర్తించి పరిశీలించి 14 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసిన పోలీసులు, గంజాయి తరలిస్తున్న వారి వివరాల కోసం విచారిస్తున్నారు.

క్లినికల్ చికిత్సకు మార్గదర్శకాలు అవసరం

● డాక్టర్ గోయల్

అడయార్, మే 14 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల వైద్యం, చికిత్స కోసం సరైన ఆధారిత మార్గదర్శకాల అభివృద్ధికి క్రమబద్ధమైన పరిశోధన మన దేశంలో ప్రారంభ దశలోనే ఉందని శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ సెకండరీ అండ్ రీసెర్చ్‌కు చెందిన టెక్నికల్ రిసోర్స్ సెంటర్ డాక్టర్ సంచల్ గోయల్ వెల్లడించారు. ఇటీవల ఈ ఇన్‌స్టిట్యూట్‌లో 'ఎవిడెన్స్ బేస్డ్ రీసెర్చ్' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సు అనంతరం కేంద్ర ఆరోగ్య, సంక్షేమ మంత్రిత్వ శాఖ భారతీయ పరిస్థితులకనుగుణంగా సరైన అధ్యయనాలు నిర్వహించి మార్గదర్శకాలను విడుదల చేయనుందని డాక్టర్ సంచల్ గోయల్ తెలిపారు. ఆధారాల ఆధారిత పద్ధతులను అభివృద్ధి చేసే ఈ సంస్థ ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 27 సాంకేతిక వనరుల కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వాటిలో శ్రీరామచంద్ర ఒకటని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **ఎగ్మూర్:** సైడెన్‌హామ్స్ వీధి కొంత భాగం, పీటీ ముదాలి వీధి, సామిపిళ్లై వీధి కొంత భాగం, ఏపీ రోడ్డు, హంటర్స్ లైన్, జనరల్ కోలిన్స్ రోడ్డు, మాదేక్స్ వీధి, వీవీ ఆలయ వీధి, కురవన్‌కుళం, సుబ్బహ నాయుడు వీధి, నెహ్రూ స్టేడియం (ఔట్‌డోర్ అండ్ ఇండోర్) అప్పారావు గార్డెన్, పెరియతంబి వీధి, ఆండియప్పన్ వీధి, ఆనందకృష్ణన్ వీధి, పీకే ముదాలి వీధి, చూలై ఏరియా, కేపీ పార్క్ ఏరియా, పెరంబూర్ బారక్స్ రోడ్డు, రోట్లర్ వీధి, కలతియప్ప వీధి, విర్భూర్‌ముత్తయ్య వీధి, డాలి వీధి, మాణిక్యం వీధి, రంగయ్య వీధి కొంత భాగం, అష్టభుజం రోడ్డు కొంత భాగం, రాఘవ వీధి కొంత భాగం. **పారివాక్కం:** తిరుకోయిల్‌పత్తు, తిరుమనం, కావల్‌చేరి, వాయానల్లూర్, సోరన్‌చేరి, ఒలిచేరి, చిట్టుకాడు. **తిరువేర్కాడు:** తీరోడమ్ వీధి, సన్నాధి వీధి, రాందాస్ నగర్, చిన్న కొలడి, తిరువేంగడం నగర్, అన్బు నగర్, చెల్లియమ్మన్ నగర్, దేవి నగర్, కావేరి నగర్, శ్రీనివాస నగర్, అరుళ్ నగర్, నాదసేనార్ నగర్, భారతి నగర్, లక్ష్మి నగర్ ఫేస్-1,2.

కుండ్రత్తూరులో ఇళ్లు కూల్చివేత


ఇళ్లను కూల్చివేస్తున్న దృశ్యం

ప్యారీస్, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుండ్రత్తూరులో ముందుగా నోటీసులివ్వకుండా 35 ఇళ్లు కూల్చివేయడానికి నిరసనగా స్థానికులు ఆందోళన నిర్వహించారు. కుండ్రత్తూరు మున్సిపాలిటీ కరైమానగర్‌లోని కుండ్రత్తూరు-పల్లావరం రోడ్డును ఫోర్‌వేగా విస్తరించాలని రహదారులశాఖ నిర్ణయించింది. ఈ మార్గంలో రోడ్డు పక్కన 50ఏళ్ళకు పైగా కొంతమంది ప్రజలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. వీరికి రేషన్‌కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, విద్యుత్ కనెక్షన్లు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, కుండ్రత్తూరు-పల్లావరం రోడ్డులో ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు పోలీసుల భద్రతల మధ్య కుండ్రత్తూరు మున్సిపాలిటీ అధికారులు, రెవెన్యూ అధికారులు, రహదారుల విభాగం అధికారులు ఎక్స్‌కవేటర్ల సాయంతో ఆ ప్రాంతంలోవున్న 35ఇళ్లను 15 దుకాణాలను బుధవారం ఉదయం తొలగించారు. దీనిని వ్యతిరేకించిన స్థానికులు కూల్చివేతల గురించి తమకు ముందుగా తెలియజేయకుండా కూల్చివేత చర్యలు చేపట్టడాన్ని ఖండిస్తూ రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు.

శుభముహూర్తాలు, వారాంతపు రోజుల్లో ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): శుభముహూర్తం, వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకార్యార్థం ఈ నెల 16 నుంచి 18వ తేది వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలిపింది. ఈ మేరకు ఎస్ఈటీసీ విడుదల చేసిన ప్రకటనలో... కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు ఈ నెల 16వ తేది 570 బస్సులు, 17వ తేది 605 బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఈ నెల 16న 100 బస్సులు, 17న 90 బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుంచి 16న 24 బస్సులు, 17న 100 బస్సులు నడుపనున్నారు. అలాగే, సెలవులు ముగించుకుని తిరిగి వచ్చే వారి కోసం ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

పట్టాలో పేర్ల సవరణకు అవకాశం

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టాల్లో మృతిచెందిన వారి పేర్లు తొలగింపు, కొత్త యజమానుల పేర్లు చేర్చడం తదితరాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని భూ నిర్వహణ కమిషనరేట్ తెలిపింది. ఆ ప్రకారం, హ్ట్టిట రిజిచ్ఛిట్టు.జొఠి.జీ అనే వెబ్‌సైట్, ఈ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తులు పరిశీలించి పట్టాలలలో పేర్లు సవరణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు భూ నిర్వహణ కమిషనరేట్ సర్క్యులర్ జారీచేసింది.

నేడు ఎన్డీఏ కూటమిపై ఓపీఎస్ ప్రకటన

వాషర్‌మెన్‌పేట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమిపై గురువారం మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం ప్రకటన చేస్తారని ఆయన మద్దతుదారులు వైద్యలింగం తెలిపారు. అన్నాడీఎంకే-బీజేపీ కూటమిలో ఓపీఎస్‌కు ప్రాధాన్యత తగ్గిందనే వార్తల నేపథ్యంలో, నగరంలో ఓపీఎస్ తన మద్దతుదారులతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం వైద్యలింగం మాట్లాడుతూ... ప్రస్తుతం తాము ఎన్డీఏ కూటమిలో ఉన్నామన్నారు. ఈ కూటమిలో తమ ప్రాధాన్యత తగ్గిందనే నేపథ్యంలో, గురువారం ఓపీఎస్ కీలక ప్రకటన చేయనున్నారని వైద్యలింగం తెలిపారు.

లంచం కేసులో కార్పొరేషన్ ఉద్యోగికి ఐదేళ్ల జైలు శిక్ష

టి.నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓ దుకాణం లైసెన్స్ రెన్యూవల్ చేయడానికి రూ.700 లంచం పుచ్చుకున్న కార్పొరేషన్ ఉద్యోగి గజేంద్రన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ప్రియా తీర్పు వెలువరించారు. 2016లో తండయార్‌పేట దుర్గాదేవి నగర్‌లోని టైల్స్ దుకాణం నడుపుతున్న అంకిత్‌కుమార్ తన దుకాణం లైసెన్స్ రెన్యూవల్ కోసం గజేంద్రన్‌ను సంప్రదించగా రూ.700లు లంచం అడిగాడు. ఈ విషయాన్ని అవినీతి నిరోధక విభాగం అధికారులకు అంకిత్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో ఆ అధికారులు గజేంద్రన్ లంచం తీసుకుంటుండగా అరెస్టు చేశారు.

లారీ ప్రమాదంలో డ్రైవర్ మృతి

టి.నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): వండలూరు - మీంజూరు బైపాస్‌రోడ్డులో నిలిచి ఉన్న లారీని వేగంగా వచ్చిన మరొక లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. బైపాస్‌రోడ్డులో వెళ్తున్న లారీ ఉన్నట్టుండి ఆగిపోయింది. డ్రైవర్ లారీని ఆపి మెకానిక్ కోసం వెళ్ళాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన మరొక లారీ అదుపు తప్పి నిలిచి ఉన్న లారీ వెనుక భాగాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ లారీ డ్రైవర్ పార్తీబన్ అక్కడికక్కడే మరణించాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్ళి పార్తీబన్ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టంకు తరలించారు.

ఆలయ వేడుకల్లో అపశ్రుతి

● తేనెటీగల దాడిలో 40 మందికి గాయాలు

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లాలో ఆలయ ఉత్సవాల సమయంలో తేనెటీగలు భక్తులపై దాడిచేయడంతో 40 మందికి గాయాలయ్యాయి. అర్కాడు సమీపం కీల్‌విశారం గ్రామంలోని చిన్న గంగైయమ్మన్ ఆలయ చిత్తిరై వేడుకలు కోలాహలంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ఉత్సవమూర్తులను వాహనంలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో బాణాసంచా కాల్చారు. ఆలయ ప్రాంగణంలోని మర్రిచెట్టుపై ఉన్న తేనె తెట్టు సమీపంలో బాణాసంచా పేలింది. ఈ శబ్దానికి తేనెటీగలు భక్తులపై దాడిచేశాయి. ఈ ఘటనపై 40 మందికి గాయాలు కాగా, చుట్టుపక్కల వారు వారిని అంబులెన్స్‌ల ద్వారా వాలాజాపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పాలారు వంతెన కింద గుర్తుతెలియని మృతదేహం

వేలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి కొత్త బస్టాండ్ సమీపంలోని పాలారు నది వంతెన కింద గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, మృతుడు వివరాల కోసం విచారిస్తున్నారు.

ఐస్‌క్రీమ్ తిన్న ఇద్దరు పిల్లలకు అస్వస్థత

● వ్యాపారిని చితకబాదిన గ్రామస్తులు

తిరుత్తణి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఐస్‌క్రీమ్ తిన్న చిన్నారులు అస్వస్థతకు గురైన సంఘటన తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని వెంకటాపురం అరుంధతీయ కాలనీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే బుధవారం ఉదయం వరదరాజన్ కుమారుడు నితీష్ (5), శేఖర్ కుమారుడు చంద్ర (4)అనే ఇద్దరు చిన్నారులు తమ ప్రాంతంలో వ్యాపారి దగ్గర ఐస్‌క్రీమ్ కొనుక్కొని తిన్నారు. ఈ క్రమంలో వారిద్దరు అపస్మారక స్థితిలో కిందపడిపోవడంతో అదిచూసిన ఇతర చిన్నారులు వారి తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో చిన్నారులను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం చిన్నారుల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో, గ్రామస్థులంతా ఐస్‌క్రీమ్ అమ్మిన గోవిందన్ అనే వ్యక్తిని పట్టుకుని చితకబాది, పోలీసులకు అప్పజెప్పారు. విచారణలో ఈ ఐస్‌క్రీమ్ పదార్థాలను పళ్లిపట్టుకు చెందిన మోహన్ అనే వ్యక్తి దగ్గర హోల్‌సేల్‌లో కొనుగోలు చేసి అమ్ముతున్నట్లు తెలిపాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, ఐస్‌క్రీమ్ ఏజెన్సీ నిర్వహిస్తున్న మోహన్ కోసం గాలిస్తున్నారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● డీపీఐ నేత అరెస్టు

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూవాషర్‌మెన్‌పేట పరిధిలోని ఒంటరిగా ఉన్న కాలేజీ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన డీపీఐ నాయకుడు నన్‌మారన్ (63)ను పోలీసులు అరెస్టు చేశారు. న్యూవాషర్‌మెన్‌పేట ప్రాంతంలోని ఓ ఇంటిలో 19 యేళ్ల యువతి నివసిస్తోంది. ఆమె ఉంటున్న భవన సముదాయంలోని మరో ఫ్లాట్‌లో డీపీఐ స్థానిక నాయకుడు నన్ మారన్ నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంటిలో ఒంటరిగా ఉన్న ఆ యువతి ఇంటిలో చొరబడి ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆ యువతి కేకలు పెట్టడంతో నన్‌మారన్ పారిపోయాడు. ఈ విషయాన్ని ఆ యువతి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని నన్‌మారన్‌ను అరెస్టు చేశారు.

కోలాహలంగా గంగమ్మ ఆలయ రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

వేలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం గంగమ్మ ఆలయ రథోత్సవం కోలాహలంగా సాగింది. ఈ ఆలయ వేడుకలు గత నెలలో స్తంభ స్థాపనతో ప్రారంభం కాగా, మంగళవారం అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించారు. వేడుకల్లో ప్రధానాంశమైన రథోత్సవం బుధవారం జరిగింది. మొదట అమ్మవారిని సుగంధద్రవ్యాలతో అభిషేకం, విశేష అలంకరణ, మహా దీపారాధన నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమ్మవారిని ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులు మేకలు, కోళ్లను బలిచ్చి, పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 31 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. కమిషనర్ అరుణ్ పాల్గొని ప్రజల నుంచి సమస్యలతో కూడిన 31 వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలు విచారించి పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు.

సాయిబాబా గుడిలో సీఎం సతీమణి పూజలు



చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్‌తోపాటు ఊటీలో పర్యటిస్తున్న ఆయన సతీమణి దుర్గాస్టాలిన్ బుధవారం ఉదయం కున్నూరు ఎడపల్లి సమీపంలో ఉన్న సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. సాయిబాబా ధర్మస్థల స్వామిని శక్తిమా ఆమెకు విగ్రహాలను కానుకగా ఇచ్చి ఆశీర్వదించారు. ఆ సమయంలో నటి శరణ్య, ఆమె కుటుంబీకులు కూడా ఆ గుడికి రావటంతో దుర్గాస్టాలిన్ వారిని ఆప్యాయంగా పలకరించారు. ఆ తరువాత అదే ప్రాంతంలో ఉన్న వినాయకుడు, మురుగన్, అమ్మవారి ఆలయాలను కూడా దర్శించారు.

ట్రాఫిక్ పోలీసులకు ఫ్యాన్‌తో హెల్మెట్లు



ట్రాఫిక్ పోలీసులకు హెల్మెట్లు అందజేస్తున్న అధికారులు

వాషర్‌మెన్‌పేట, మే 14 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ నగర ట్రాఫిక్ పోలీసులకు బ్యాటరీతో పనిచేసే ఫ్యాన్‌తో కూడిన హెల్మెట్లు అందజేశారు. రాష్ట్రంలో మార్చి చివరి వారం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఎండల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ, శీతల పానీయాలు, టోపీలు అందజేస్తున్నారు.ఈ క్రమంలో, కోవై నగర ట్రాఫిక్ విభాగం పోలీసులకు రూ.15 వేల విలువైన బ్యాటరీతో కూడిన హెల్మెట్లు అందజేశారు. తొలివిడతగా 36 మందికి హెల్మెట్లు అందించామని, త్వరలో ట్రాఫిక్ పోలీసులు అందరికీ వీటిని పంపిణీ చేయనున్నట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

సైన్యానికి సెల్యూట్

● బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



జాతీయ పతాకాలతో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

ప్యారీస్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి, త్రివిధ దళాలకు కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జాతీయ పతాకాలతో పాల్గొన్నారు. పుదుపేటలోని చిత్రా థియేటర్ నుండి సాయంత్రం 4 గంటలకు బయలుదేరిన తిరంగా ర్యాలీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ సారథ్యం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయంలో మంచి ఫలితం ఉందన్నారు. దేశ సరిహద్దు ప్రాంతాల్లో చలి, మంచును సైతం లెక్కచేయకుండా శత్రు సైన్యానికి గట్టిగా బుద్ధిచెప్పిన ప్రధాని నరేంద్ర మోదీకి, త్రివిధ దళాలకు పార్టీ తరుపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ర్యాలీలో బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జీలు డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, అరవింద్ మేనన్, తెలంగాణ మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై , ఉపాధ్యక్షుడు ఎం.చక్రవర్తి, సీనియర్ నేతలు హెచ్ రాజా, వీపీ దురైస్వామి, కరాటే త్యాగరాజన్‌తో పాటు మహిళా, యువజన, విద్యార్థి, న్యాయవాదులు తదితర విభాగాలకు చెందిన కార్యకర్తలు 'భారతమాతాకి జై, వందే మాతరం' నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

విరాటేశ్వరాలయంలో విదేశీయుల పూజలు



పెరంబూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా వళువూర్‌లో ప్రసిద్ధి చెందిన విరాటేశ్వర ఆలయంలో 10 దేశాలకు చెందిన భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. రష్యా, కెనడా, కజకిస్తాన్, జర్మనీ తదితర దేశాలకు చెందిన 40 మంది భక్తులు మంగళవారం ఆలయానికి వచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన భక్తులు, ఆలయ ప్రాంగణంలో కూర్చొని 'ఓం నమశ్శివాయ...' అంటూ ధ్యానం చేశారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



టి.నగర్‌లోని సబర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం

సిమ్రన్‌ను రాణిలా చూసుకున్నాం..

'టూరిస్ట్ ఫ్యామిలీ' సక్సెస్ మీట్

● శశికుమార్

చిత్రజ్యోతి

రెండు దశాబ్దాల క్రితం ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన నటి సిమ్రన్‌ను మా సినిమా సెట్‌లో ఒక రాణిలా చూసుకున్నామని హీరో శశికుమార్ చెప్పారు. శశికుమార్, సిమ్రాన్ జంటగా నూతన దర్శకుడు అభినేష్ జీవింత్ రూపొందించిన చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ'. ఈ నెల ఒకటో తేదీ విడుదలై ఘన విజయం సాధించింది. మిలియన్ డాలర్స్, ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్మెంట్ తెరకెక్కించిన ఈ చిత్రంలో యోగిబాబు, మిథున్ జయ్ శంకర్, కమలేష్, ఎంఎస్ భాస్కర్, రమేష్ తిలక్, భగవతి తదితరులు నటించగా ఈ చిత్రం విజయోత్సవ వేడుకలు నగరంలో తాజాగా నిర్వహించారు. ఇందులో హీరో శశికుమార్ మాట్లాడుతూ, "వాలి', 'పంచతందిరం', 'తుల్లాద మనముం తుల్లుం' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన నటి సిమ్రన్‌ను మా చిత్ర షూటింగ్ స్పాట్‌లో ఒక రాణిలా చూసుకున్నాం. ఆమె ఈ మూవీలో నటించడం ఎంతో బలం చేకూర్చింది. ఈ సినిమా హిట్‌తో నా పారితోషికాన్ని పెంచను. గతంలో నేను నటించిన 'కుట్టిపులి', 'సుందరపాండియన్' వంటి చిత్రాల వసూళ్లను ఈ సినిమా అధిగమించింది. అనేక మంది ఈ సినిమా విజయం బలాన్నిచ్చింది' అన్నారు. నటి సిమ్రన్ మాట్లాడుతూ, 'నేను కథ వినగానే ఖచ్చితంగా హిట్ అవుతుందన్న నమ్మకం కలగడంతో పాటు ఈ సినిమాలో నటించాలని నిర్ణయం తీసుకున్నాను. ఇలాంటి మంచి చిత్రంలో నేను కూడా భాగస్వామిగా ఉండటం సంతోషంగా ఉంది. ఈ చిత్ర బృందం సభ్యులతో నటిచడంతో నేను కూడా ఒక యూత్‌గా ఫీల్ అవుతున్నాను. 20 యేళ్ళ తర్వాత ఇలాంటి పాత్రలో నటించడం పాత సిమ్రాన్‌ను గుర్తుకు తెచ్చింది' అని పేర్కొన్నారు. 'చిత్రాన్ని బ్లాక్ బస్టర్ చేసిన ప్రేక్షకులకు మీడియాకు దర్శకుడు అభినేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



అత్యాచారం చేస్తే.. కాలికి అదే శిక్ష

● వరలక్ష్మి



'ది వెర్డిక్ట్' ఆడియో రిలీజ్ దృశ్యం

సాధారణ నేరాలకు పాల్పడేవారికి కాళ్ళు చేతులు విరగ్గొడుతున్నారు.. అలాంటపుడు అత్యాచారాలకు పాల్పడేవారికి 'ఆ' ప్రైవేట్ భాగాన్ని కత్తిరించిపారెయ్యాలని హీరోయిన్ వరలక్ష్మి అన్నారు. నూతన దర్శకుడు కృష్ణ శంకర్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'ది వెర్డిక్ట్'. మర్డర్ మిస్టరీ, ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కించారు. వరలక్ష్మి, శృతిహాసన్, సుహాసిని, విద్యుల్లేఖా రామన్, ప్రకాష్ మోహన్ దాస్ ప్రధాన పాత్రలు పోషించారు. మూవీ షూటింగ్ పూర్తిగా అమెరికాలో చిత్రీకరించారు. ఈ నెల 30వ తేదీ విడుదలకానుంది. ఈ నేపథ్యంలో నగరంలో ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఇందులో చిత్ర బృందం పాల్గొనగా, నిర్మాత, దర్శకనటుడు పార్తిబన్ అతిథిగా హాజరై ఆడియో రిలీజ్ చేసి అభినందనలు తెలిపారు. ఇందులో వరలక్ష్మి మాట్లాడుతూ, 'నన్ను హాలీవుడ్ స్క్రీన్ వరల్డ్‌కు తీసుకెళ్ళిన దర్శకుడికి కృతజ్ఞతలు. నేను ఎలాంటి ఆంగ్ల భాష మాట్లాడలేదు. నేను ఇంగ్లీషులో మాట్లాడితే ఎవరికీ అర్థంకాదు. కోర్టు సన్నివేశాల్లో నటించడం ఒక సవాల్‌గా నిలిచింది. పొల్లాచ్చి అత్యాచార కేసు తీర్పు స్వాగతిస్తున్నాను. సాధారణ నేరాలకే కాళ్ళు చేతులు విరగ్గొడుతున్నారు. అత్యాచార నేరాలకు పాల్పడేవారి ప్రైవేట్ పార్ట్‌ను కత్తిరించాలి అన్నారు. నటి సుహాసిని మాట్లాడుతూ, 'ఈ కాలంలో ఒక చిత్రాన్ని కేవలం 23 రోజుల్లో పూర్తి చేయడమంటే మామూలు విషయం కాదు. ఈ అరుదైన ఘనత సాధించిన చిత్ర బృందానికి ధన్యవాదాలు. షూటింగ్ కూడా చాలా సరదాగా గడిచిపోయింది' అన్నారు. నటుడు పార్తిబన్ మాట్లాడుతూ, 'తన అందంపై గర్వపడే వ్యక్తి సుహాసిని. సాధారణంగా 28 యేళ్ళుదాటిని తర్వాత మహిళలు వయసు చెప్పరు. కానీ, సుహాసినికి మాత్రం ఆమె అందంపై ఉండే గర్వం కారణంగా ఆమె అన్ని విషయాలు ఓపెన్‌గా మాట్లాడతారు. ఈ మూవీ విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. ఆ తర్వాత చిత్ర దర్శకుడు, నిర్మాత, ఇతర నటీనటులు ప్రసంగించారు.

నేను పెరుమాళ్ భక్తుడిని.. హేళన చేయను

● సంతానం



తాను వేంకటేశ్వర స్వామి (పెరుమాళ్) భక్తుడనని, పెరుమాళ్‌పై అంచంచలనమైన భక్తి విశ్వాసాలున్నాయని, అందువల్ల ఆయనను హేళన చేయనని హీరో సంతానం స్పష్టంచేశారు. నిహారికా ఎంటర్‌టైన్మెంట్ నిర్మాణంలో హీరో ఆర్య నిర్మాతగా సంతానం హీరోగా నటించిన తాజా చిత్రం 'డెవిల్స్ డబుల్ లెక్స్ లెవల్'. గీతికా, సెల్వరాఘవన్, గౌతం వాసుదేవ్ మేనన్, నిళల్‌గల్ రవి తదితరులు నటించారు. ప్రేమ్ ఆనంద్ దర్శకుడు. ఈ నెల 16న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలో ఉన్న ఒక పాట ఇపుడు వివాదాస్పదంగా మారింది. 'శ్రీనివాసా గోవిందా... శ్రీ వేంకటేశా గోవిందా' అనే సాగే ఈ పాట శ్రీవారిని హేళన చేసేలా ఉందంటూ అనేక మంది భక్తులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రెండు మూడు కేసులు కూడా నమోదయ్యాయి.అలాగే, తాజాగా తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్ళిన మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామిని తిరుపతి జనసేన నేత కిరణ్ రాయల్ కలిసి ఈ పాట విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్ళడంతో పాటు తిరుపతి పోలీస్ స్టేషనులో ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో హీరో సంతానం స్పందిస్తూ, 'ఆ పాటలో శ్రీవారిని హేళన చేయలేదు. ముఖ్యంగా నేను పెరుమాళ్ భక్తుడుని. దేవుడిని హేళన చేయను' అంటూ వివరణ ఇచ్చారు.

రామ్ - మిర్చి శివ కాంబోలో 'పరందు పో'

డైరెక్టర్ రామ్ దర్శకత్వంలో హీరో మిర్చి శివ నటించిన తాజా చిత్రం 'పరందు పో'. గ్రేసీ ఆంటోనీ, అంజలి, మాస్టర్ మిదూల్ రియాన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. సెవన్ హిల్స్ పతాకంపై మ్యూజికల్ కామెడీ మూవీగా రూపుదిద్దుకుంది. ఫిబ్రవరిలోనే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని 54వ రోటర్‌డామ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించగా, విదేశీ సినీ ప్రముఖుల ప్రశంసలు కూడా అందుకుంది. ఈ నేపథ్యంలో తాజాగా మూవీని జూన్ 4న విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. త్వరలోనే ట్రైలర్, ఆడియోను రిలీజ్ చేయనున్నారు. రామ్ - శివ కాంబినేషన్‌లో కొత్తగా ఉండటంతో ఈ మూవీపై అంచనాలు భారీగానే నెలకొన్నాయి.



'పరందు పో'లో ఓ దృశ్యం

మండూక మహర్షికి శాపవిమోచనమిచ్చి

తిరుమాలిరుంజోలై బయల్దేరిన కళ్లలగర్





తేనూరు మండపం వద్ద మండూక మహర్షికి శాపవిమోచన మిస్తున్న కళ్లలగర్ స్వామి

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): వైగై నదిలో వేంచేసి భక్తులను అనుగ్రహించి బయల్దేరిన కళ్ళలగర్‌స్వామి తేనూరు మండప ప్రాంతంలో గరుడవాహనంపై చేరుకుని మంగళవారం మధ్యాహ్నం మండూక మహర్షికి శాపవిమోచనం కలిగించారు. కప్పరూపంలో ఉన్న మండూక మహర్షిని కొంగల బారి నుండి కళ్ళలగర్ కాపాడి ఆయనకు శాపవిమోచనమిచ్చారు. ఈ ఘట్టాన్ని భక్తులు చక్కగా ప్రదర్శింపజేశారు. వైగ నదీ ఒడున్న ఓ పెద్ద గోయి తవ్వి దానిని నీటితో నింపి చేరువగా మండూక మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆ గోతికి నలువైపులా ఉన్న అరటి చెట్లకు గూడబాతులను కట్టారు. ఆ తర్వాత కళ్ళలగర్‌కు దీపారాధన చేసిన మీదట గూడబాతులకు బంధవిముక్తి కావించడందో అవి ఆగ్నేయదిశగా ఎగురుకుంటూ వెళ్ళాయి. ఆ దిశగా గూడబాతులు ఎగురుతూ వెళ్లటం వల్ల ఈ యేడాది పంటలు సమృద్ధిగా పండతాయని వైష్ణవపండితులు తెలిపారు. ఆ తర్వాత కళ్ళలగర్ అక్కడి నుండి బయలుదేరి హనుమంతుడి ఆలయంలో భక్తులకు దర్శనమిచ్చారు. అక్కడి నుండి బయలుదేరి దారి పొడవునా ఉన్న వివిధ ఆలయాల మంటపాల్లోనూ పావుగంట సేపు వేంచేసి భక్తులను అనుగ్రహించారు. రామరాయర్ మండపం చేరుకున్నాక మంగళవారం అర్ధరాత్రి నుండి బుధవారం వేకువజాము వరకూ స్వామివారు దశావతారాల అలంకరణతో కనువిందు చేశారు. బుధవారం ఉదయం మోహిని అవతారంలో దర్శనమిచ్చిన కళ్ళలగర్ స్వామి మధ్యాహ్నం తిరుమంజనం పూర్తి చేసుకుని అనంతరాయర్ పల్లకీలో రాజాంగ అలంకారంతో బయలుదేరి రామనాథపురం చక్రవర్తి సేతుపతి మండపంలో వేంచేశారు. రాత్రి అక్కడే బసచేసి భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం వేకువజాము పూల పల్లకీలో స్వామివారు కరుప్పణ్ణసామి ఆలయంలో ఊరేగుతారు. రాత్రి ఏడుగంటలకు మూండ్రువాడి ప్రాంతంలో మదురై నగర వాసులు, కళ్ళలగర్ వైగై నదీ ప్రవేశ మహోత్సవాన్ని తిలకించలేకపోయిన భక్తులు వేల సంఖ్యలో గుమికూడి కళ్ళలగర్ స్వామికి ఘనంగా వీడ్కోడు పలుకనున్నారు. అక్కడి నుండి కళ్ళలగర్ స్వామి తన స్థిరనివాసమైన తిరుమాలిరుంజోలైకి బయలుదేరుతారు.



చెన్నై పెరియమేడులోని ప్రభుత్వ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో రూ.21.10 కోట్లతో నిర్మించనున్న భవనాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు సామినాథన్, పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ తదితరులు



చెన్నై తిరువిక నగర్ జోన్ సీమాతమ్మన్ ఆలయ మండప నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేషన్ మేయర్ ప్రియ

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల హవా

అడయార్, మే 14 (ఆంధ్రజ్యోతి): తాజాగా విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో చెన్నై నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. తాంబరానికి చెందిన హరిణి అనే విద్యార్థిని 497 మార్కులు, పోరూర్‌కు చెందిన వికాష్ అనే విద్యార్థి 496 మార్కులు సాధించారు. వీరితో పాటు మరో 25 మంది విద్యార్థులు 490కి పైగా మార్కులు సాధించారు. పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత ఉండగా, 25 మంది విద్యార్థులు 490 మార్కులు దాటడం విశేషం. ఆయా విద్యార్థులను నారాయణ విద్యా సంస్థల తమిళనాడు అకడమిక్ హెడ్ డాక్టర్ లక్ష్మీ సంయుక్త, కోర్ డీన్ శివరామకృష్ణ ఏడీజీఎం అనిల్, ఏజీఎం శిల్ప తదితరులు అభినందించారు. అదే విధంగా నారాయణ గ్రూపు సంస్థల డైరెక్టర్లు శారణి, సిందూర వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం



ఊటీలో బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళుతూ ఓ మైదానంలో ఫుట్‌బాల్ ఆడుతున్న బాలబాలికలతో సరదాగా మాట్లాడి, గ్రూఫ్‌ఫొటో దిగిన ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్, డీఎంకే ఎంపీ రాజా

17 నుంచి కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు

చంద్రగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు వసంతోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటలకు ఉత్సవర్లను ఆలయం నుంచి వసంత మండపానికి వేంచేపు చేస్తారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారులతో వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, సీతాలక్ష్మణ, హనుమాన్ సమేత శ్రీరామ చంద్రమూర్తి, రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ఆస్థానం నిర్వహిస్తారు. 18వ తేదీ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరగనుంది. రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వీధి ఉత్సవం నిర్వహిస్తారు. పాల్గొనదలిచిన భక్తులు రూ.516 చెల్లించాల్సి ఉంటుంది. ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. కాగా, వసంతోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు కల్యాణోత్సవం, ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

యువతకు ఉపాధి కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్, యూనివర్శిటీ కళాశాలల్లో ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా ఫీచర్ స్కిల్స్ ప్రణాళికలు రూపొందించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్లకు బ్యాడ్జీలు, సర్టిఫికెట్లను బుధవారం కలెక్టర్ అందించారు. నీతి అయోగ్ గౌరవ సలహాదారు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో ప్రతిసిద్ధ చెందిన విద్యాసంస్థలలో నాస్కాం ఫీచర్స్ స్కిల్స్ అనుసంధానం కోసం చర్యలు తీసుకుని భవిష్యత్తులో విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి కోర్సులను చేయడం వల్ల ఉపాధి అవకాశాలు ఎక్కువగా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాస్కాం డైరెక్టర్ ఉదయ్‌శంకర్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీలో వీసీఐ సభ్యుల తనిఖీ



తిరుపతిరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాలను బుధవారం వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) బృంద సభ్యులు పరిశీలించారు. మూడ్రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు వీసీఐ సభ్యులు డాక్టర్ తంగ్రైవేలు, మహారాష్ట్ర వెటర్నరీ అండ్ అనిమల్ సైన్సెస్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్వీ అవంధ్కర్ కలసి 10 కళాశాలల్లో డిపార్ట్‌మెంట్లను తనిఖీ చేశారని అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. ఫ్యాకల్టీ, సదుపాయాలు, ల్యాబ్‌ల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి డీఆర్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, ప్రొఫెసర్ ఎంవీఏఎస్ సూర్యనారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కమిషనరు మౌర్య

విశ్వరూపానికి హారతి

విశ్వరూప దర్శనానికి భక్తుల నిరీక్షణ



అమ్మవారి విశ్వరూపానికి వేసిన తెర

విశ్వరూపం వద్దకు పేరంటాల వేషధారి సాంబ

ఆలయానికి వస్తున్న పేరంటాల వేషధారి

కమిషనరు మౌర్యకు మట్టి అందిస్తున్న పేరంటాలు

ప్రతిమ మన్నును భక్తులకు పంచేసిన నిర్వాహకులు

చెంప తాకుతున్న సాంబ

మన్నుకోసం ఎగబడుతున్న భక్తులు

● ఫెస్టివ్ వైబ్స్ అదుర్స్

జాతర.. జయప్రదం

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగ జాతర జయప్రదమైంది. మంగళవారం ఒక్కరోజే లక్ష మందికిపైగా భక్తులు గంగమ్మను దర్శించుకున్నట్టు అంచనా. గతం కంటే పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తినా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాతర క్రతువు ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈనెల 6వ తేదీన అర్ధరాత్రి అవిలాల నుంచి చాటింపుతో గంగజాతర సంబరం మొదలైంది. వారం రోజులపాటు జాతర వైబ్స్ నగరంతో పాటు చుట్టుపక్కల పల్లెలను చుట్టుముట్టాయి. రోజుకో వేషం.. చిత్ర, విచిత్రమైన అలంకారాలతో పలువురు భక్తులు గంగమ్మను దర్శించుకున్నారు. అక్కడక్కడా అలకలు, అరుపులు మినహా జాతర ఆద్యంతం అదిరిపోయింది. ఇక, వైకుంఠ దర్శన టోకెన్ల జారీలో దుర్ఘటన, ఇటీవల సింహాచలంలో గోడకూలిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య గంగజాతరపైనే ఫోకస్ పెట్టారు. 300 మంది పోలీసు బలగాలను మోహరింపచేశారు. ఆలయ పరిసరాలు శుభ్రంగా పెట్టేందుకు 200 మంది పారిశుధ్య సిబ్బంది ఏర్పాటుచేశారు. సచివాలయ ఉద్యోగులనూ జాతర విధులకు కేటాయించారు. ఇక, జాతర బాధ్యతలు చేపట్టిన కమిషనరు మౌర్య, అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకున్నారు. వీఐపీ పాసులు లేకుండా చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల సపరివార సమేత హడావుడిని తగ్గించారు.

అప్పుడు రూ.2కోట్లు.. ఇప్పుడు రూ.20లక్షల్లోపే

వైసీపీ హయాంలో జరిగిన జాతరకు దాదాపు రూ.2 కోట్లు ఖర్చు పెట్టారు. సామూహిక జంతుబలులిచ్చి తెగిన తలలపై కర్పూర హారతులతో ఆలయ పరిసరాలను భీతావహంగా మార్చారు. వైసీపీ శ్రేణులే ఆలయం చుట్టూ చేరి హడావుడి చేసి, సామాన్య భక్తులకు చుక్కలు చూపించారు. ఈసారి జాతర ఖర్చు రూ.20లక్షల్లోపేనని ఆలయ అధికారులు చెబుతున్నారు. టీటీడీ, తుడా, కార్పొరేషన్ నుంచి ఎలాంటి ఆర్థికసాయం తీసుకోలేదు. సామాన్య భక్తులూ ఇబ్బంది పడిన సందర్భాలు కనిపించలేదు. సాధారణ క్యూలైన్‌లోని భక్తులకూ పది, పదిహేను నిమిషాల్లో అమ్మవారి దర్శనం అయింది.

క్రౌడ్ మేనేజ్మెంట్‌పై దృష్టిపెట్టాం

జాతర రోజున క్రౌడ్ మేనేజ్మెంట్‌పైనే దృష్టిపెట్టాం. పోలీసులదే ఆ క్రెడిట్. అదనపు బలగాలు మోహరించి క్యూలైన్లలో భక్తులు పడిగాపులు లేకుండా చూశాం. వీఐపీ లైను లేకుండా సాధారణ భక్తులనూ వదిలేయడంతో ఆలయప్రాంగణంలో రద్దీని తగ్గించగలిగాం. టీటీడీ ఏర్పాటు చేసిన గ్యాలరీలు ఉపయోగపడ్డాయి. విశ్వరూపం తయారు చేసేందుకు కొంత సమయం దర్శనం ఆపాల్సివచ్చింది. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా జాతర జయప్రదం కావడం సంతోషంగా ఉంది.

- మౌర్య, కార్పొరేషన్ కమిషనర్

తాత్కాలిక హుండీ ఆదాయం రూ10.66 లక్షలు

తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీని బుధవారం సాయంత్రం లెక్కించారు. వీటిద్వారా రూ10.66లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. శాశ్వత హుండీలను గురువారం లెక్కించనున్నారు.

హోం స్టేలకు చట్టబద్ధత అవసరం

తిరుపతి(నేరవిభాగం), మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త విధానంలో ఏర్పాటవుతున్న హోం స్టేలకు చట్టబద్ధత అవసరమని జీఎస్టీ జాయింట్ కమిషనరు జాన్ స్టీవెన్సన్ పేర్కొన్నారు. తిరుపతిలో ఇటీవల హోటళ్లు, లాడ్జీలకు పోటీగా ఏర్పాటవుతున్న హోంస్టేలకు పన్నులు, ఇతర వివరాలు నిర్వాహకులు సమర్పించడం లేదని గమనించిన జీఎస్టీ సహాయ కమిషనరు శ్రీనివాసులు నాయుడు వీటిని క్రమబద్ధీకరించి, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం దాదాపు 100 మంది హోంస్టేల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. హోంస్టేలకు జీఎస్టీ అధికారుల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రోజుకు రూ.7500 అద్దె ఉన్న గదులకు 12 శాతం.. ఆపై వాటికి 18 శాతం పన్నులు చెల్లించాలన్నారు. 'మా ఇంటిని అద్దెకు ఇస్తే జీఎస్టీ కట్టాలా? మా ఇంట్లో అతిథులకు ఆతిథ్యం ఇస్తే మీకెందుకు జీఎస్టీ కట్టాలి? ఆన్‌లైన్‌లో గదులు బుక్ చేసుకొన్నప్పుడే పన్ను చెల్లిస్తున్నాం. మళ్లీ ఎందుకు జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి? కేరళలో టూరిజం విభాగం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చి హోం స్టేలను అనుసంధానం చేసేలా మాకూ వెసులుబాటు కల్పించాలి' అని కొందరు నిర్వాహకులు అధికారులను అడిగారు. ఇంటిని కమర్షియల్‌గా అద్దెకు ఇస్తే జీఎస్టీ చెల్లించాలని జీఎస్టీ జేసీ జాన్ స్టీవెన్సన్ స్పష్టంచేశారు. రూ20 లక్షల కంటే ఎక్కువ సంపాదించే వారే జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు రేణుక, నూర్జాహన్, సీటీవో అధికారులు పాల్గొన్నారు.



నిర్వాహకులతో సమావేశమైన జీఎస్టీ జేసీ స్టీవెన్సన్, సహాయక కమిషనరు శ్రీనివాసులు నాయుడు

'ఎర్ర' దొంగకు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం) మే 14(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమ నాయుడు కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా పీలేరు మండలం మారంరెడ్డిగారిపల్లికి చెందిన అరవ వెంకటనారాయణ రాజు, గుండ్లూరు చెంగల్ రెడ్డి, దళాలి నారాయణ రాజు 2021 జనవరి 11న విఠలం గ్రామం వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అప్పటి వాయల్పాడు ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది దాడులు చేశారు. తిరుపతి నుంచి మదనపల్లె వైపు వేగంగా వెళుతున్న కారును ఆపగా, ఆపలేదు. కొంతదూరం వెళ్లాక ఆ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చింతచెట్టును ఢీకొంది. వాహనంతో పాటు ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ సమయంలోనే గుండ్లూరు చెంగల్ రెడ్డి, దళాలి నారాయణ రాజు మృతి చెందారు. మిగిలిన నిందితుడు అరవ వెంకటనారాయణ రాజుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు.

చిన్నారుల రూ.లక్ష విరాళం



తిరుపతి(కలెక్టరేట్), మే 14(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'లో అసువులు బాసిన వీరజవాన్ల సహాయార్థం తిరుపతి నగరానికి చెందిన అనిరుద్, ఆశ్రీద్, సుచిత్ర రూ.లక్ష అందించారు. ఈ మేరకు చెక్కును బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు.

లీడ్ బ్యాంక్ మేనేజర్‌గా రవికుమార్

తిరుపతి(కలెక్టరేట్), మే 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరుగా జి.రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



కొబ్బరికాయలు సమర్పిస్తున్న పళణిస్వామి

తిరుమల, మే14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పళణిస్వామి,కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌పి మోహన్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీ బోటే ఉన్నారు. పళణిస్వామి దర్శనం అనంతరం అఖిలాండం వద్దకు చేరుకున్న కొబ్బరికాయలు సమర్పించారు.

పాలిసెట్, ఏపీఆర్జేసీ ఫలితాల్లో 'విశ్వం' విద్యార్థుల హవా



ఏపీఆర్‌జేసీ టాపర్లను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

- ఏపీఆర్‌జేసీలో స్టేట్‌లో టాప్‌టెన్‌లో నాలుగుర్యాంకులు
- పాలిసెట్‌లో జిల్లాస్థాయిలో టాప్ ర్యాంకులు కైవసం

తిరుపతి(విద్య), మే14 (ఆంధ్రజ్యోతి): ఏపీప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఏపీ ఆర్జేసీ, పాలిసెట్ ఫలితాల్లో తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుపతిలోని 'విశ్వం' స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏపీఆర్‌జేసీలో ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో వై.దేదీప్యకు 3వర్యాంకు, కె.మునిరూపేష్‌కు 7వ, జె.అంజలికి 9వ, మనీషాకు 10వ ర్యాంకు వచ్చిందన్నారు. వీరితోపాటు రేవంత్, అబ్దుల్‌ఖాదర్, యోగి, సమత, దేదీప్య, భవ్య, శ్రీగీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటారన్నారు. పాలిసెట్‌లో ఎం.కావ్యశ్రీ 120కి117మార్కులతో బాలికలవిభాగంలో జిల్లాలో టాపర్‌గా నిలచిందని ఆయన తెలిపారు. కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్‌ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య, రాజకుమారి 112, ఎన్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109 మార్కులతో ప్రతిభ చాటారన్నారు. సైనిక్, నవోదయ, మిలటరీస్కూల్ ప్రవేశ పరీక్షలతోపాటు ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లోనూ తమ విద్యార్థులు ఏటా టాప్‌ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పోటీపరీక్షల సమాచారం కోసం 8688888803/02, 9399976999 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసివిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.

తుడా కార్యదర్శిగా ఎన్వీ శ్రీకాంత్ బాబు



తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) కార్యదర్శిగా డాక్టర్ ఎన్వీ శ్రీకాంత్ బాబు నియమితులయ్యారు. పశు వైద్యశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ అయిన శ్రీకాంత్ ప్రస్తుతం శ్రీకాళహస్తి ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. డెప్యుటేషన్‌పై మున్సిపల్ శాఖకు బదిలీ అయిన ఆయన్ను.. ఖాళీగా వున్న తుడా కార్యదర్శి పోస్టులో ప్రభుత్వం నియమించింది. ఈ పోస్టులో ప్రాథమికంగా ఏడాది పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇద్దరు మహిళల నుంచి 24 కిలోల గంజాయి స్వాధీనం

రేణిగుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మహిళల నుంచి 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు అర్బన్ పోలీసులు తెలిపారు. బుధవారం రేణిగుంటలోని ఓ లాడ్జిలో ఒడిశాకు చెందిన ఇద్దరు మహిళలు అద్దెకు దిగారు. వీరి కదలికలు అనుమానంగా ఉండడంతో సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మహిళల గదిని తనిఖీ చేశారు. రెండు సూట్‌కేసుల్లో 24 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. ఇద్దరు మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విశాఖ ఏజెన్సీలో కొన్న గంజాయిని చెన్నైలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏర్పేడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కోళ్లవ్యాన్
- ఇద్దరు వ్యాన్ డ్రైవర్ల దుర్మరణం

ఏర్పేడు, మే 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని కోళ్ల వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో కోళ్ల వ్యాను డ్రైవర్, అతడికి సహాయంగా వచ్చిన మరో డ్రైవర్ దుర్మరణం చెందారు. ఈ ఘటన ఏర్పేడు మండలం మేర్లపాక టోల్ ప్లాజా వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగింది. సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కోళ్ల వ్యాన్ టోల్‌ప్లాజా వద్ద నేషనల్ హైవే పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ధర్మపురికి చెందిన కృష్ణన్ పెరుమాళ్(55), రామన్ మధు(40) అక్కడికక్కడే మృతి చెందారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కోళ్ల లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్, సహ డ్రైవర్ మృతదేహాలను ఎక్స్‌కవేటర్ సాయంతో వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రామన్‌మధు - కృష్ణన్ పెరుమాళ్ మృతదేహాలు



రోడ్డు ప్రమాదాన్ని పరిశీలిస్తున్న సీఐ

తిరుమలలో సెక్యూరిటీ అడిటింగ్ కమిటీ తనిఖీలు



ఆలయం వద్ద తనిఖీలు చేస్తున్న కమిటీ సభ్యులు

తిరుమల, మే 14 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో ఉద్రిక్తత నేపథ్యంలో సెక్యూరిటీ అడిటింగ్ కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం తిరుమలలో తనిఖీలు నిర్వహించారు. సభ్యులు సునిత్ గరుడ, ఆరిఫ్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అధికారులతో కలిసి శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, ముఖ్య రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. భద్రతాపరంగా కీలకమైన అలిపిరి తనిఖీ కేంద్రం, కాలినడక మార్గాలు, శ్రీవారి పాదాల మార్గం, హథీరాంజీ మఠం, శ్రీవారి ఆలయ బూందీపోటు, మాడవీధులు, అన్నప్రసాద కేంద్రం, వైకుంఠం1, రింగురోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. మరింత భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

గంగాభవానికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 14 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాభవాని ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును ఏపీ నర్సింగ్ కౌన్సిల్ నుంచి పొందారు. నర్సింగ్ రంగంలో ఈమె చేసిన కృషికి గుర్తింపుగా విజయవాడలో గల తుమ్మలపల్లె కళా క్షేత్రంలో చేపట్టిన నర్సుల దినోత్సవ సభలో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

తిరుమలలో ఒడిశా భక్తుడి అదృశ్యం



నార్సింగ్‌నాయక్

తిరుమల, మే14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఒడిశాకు చెందిన నార్సింగ్ నాయక్(57) అనే భక్తుడు కనిపించకుండా పోయాడు. కోరాపుట్ జిల్లా, ఖతలపడారు గ్రామం నుంచి పది మంది కుటుంబ సభ్యులతో కలిసి 11న ఆయన తిరుమలకు వచ్చాడు. అదేరోజు రాత్రి 8.30 గంటలకు అఖిలాండం వద రద్దీలో కనిపించకుండా పోయాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈయన వివరాలు తెలిసిన వారు 94407 96769, 0877 2289027 నెంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం

ఎర్రావారిపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) ; శేషాచల అడవుల నుంచి తమిళనాడుకు ఎర్రచందనం తరలిస్తుండగా వాహనం సహా స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకట్రామణ తెలిపారు. మండలంలోని ఎల్లమంద క్రాస్ నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందని సమాచారం అందడంతో మంగళవారం రాత్రి ఎల్లమంద గ్రామంలో ఫారెస్టు సిబ్బంది నిఘా ఉంచారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో కారు వేగంగా ఎల్లమంద గ్రామం ఇరగంరెడ్డిగారి పల్లె రోడ్డు వైపు వెళుతుండగా వెంబడించారు. తూనికాకుల బండ వద్ద కారును వదిలేసి ఇద్దరు స్మగ్లర్లు పారిపోయారు. కారులో పరిశీలించగా 200 కేజీల బరువున్న 8 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని రేంజర్ తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఆర్వో వెంకట్రామణ, ఎఫ్ఎస్వో మునిస్వామి నాయక్, ఎఫ్‌బీవోలు లక్ష్మీప్రసాద్, రాజేష్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.